ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
సోమవారం 5 ఆగస్టు 2024



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 26.0
తణుకు : 33.0 - 25.0

జ్ఞానేశ్వరికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సక్సెస్ 7
'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన దాతలు, ప్రభుత్వం



శాకంబరిగా వాసవీమాత..

పెనుగొండ వాసవీ శాంతి ధామ్‌లో కొలువైన వాసవీ మాత ఆదివారం శాకంబరి దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.
-పెనుగొండ

బదిలీల గుబులు



అధికారుల పక్క చూపులు
ఏజన్సీ, మెట్ట ప్రాంతాల్లో పనిచేసేందుకు విముఖత
పశ్చిమపై ఉద్యోగుల కన్ను
అదే జరిగితే తమకు అవకాశాలు రావంటూ జిల్లా సీనియర్లలో కలవరం
ఆచితూచి వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రెవెన్యూ శాఖలో నిర్వహిస్తున్న బదిలీల్లో తహసీల్దార్‌లు కూటమి ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. పక్కచూపులు చూస్తున్నారు. ఇతర జిల్లాలో తమకు నచ్చిన చోటుకు బదిలీ అయ్యేలా ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. దాంతో రెవెన్యూ శాఖలోని సీనియర్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తమకు అవకాశాలు తప్పి పోతా యంటూ మదన పడుతున్నారు. ఎన్నికల ముందు జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్‌లు మళ్లీ సొంత జిల్లాలకు చేరు కున్నారు. మండలాల వారీగా పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ సారి ప్రభుత్వం తహసీల్దార్‌ల పోస్టింగ్‌లో నిబంధనలు పెట్టింది. ఎన్నికల ముందు పనిచేసిన నియోజకవర్గంలోగానీ, స్థానికత ఉన్న సొంత డివిజన్‌లో గానీ పోస్టింగ్ ఇవ్వకూడదని స్పష్టం చేసింది. నిబంధనలు పాటించినప్పుడు గతంలో పనిచేసిన జిల్లాలో అవకాశం లేనట్టయితే పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలో అయినా పోస్టింగ్ ఇవ్వాలని సూచించింది. దీనిని అవకాశంగా తీసుకుని కొందరు అధికారులు పక్కా జిల్లాలో పోస్టింగ్ పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వాస్తవానికి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాతో పాటు, కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో దాదాపు 15 మండలాల్లో తహసీల్దార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో యలమంచిలి, ఆచంట, కాళ్ల, అత్తిలి మండలాల్లో తహసీల్దార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే భీమవరం ఆర్డీవో కార్యాలయంలోనూ ఏవో పోస్టింగ్ ఖాళీగా ఉంది. తహసీల్దార్ కేడర్ అధికారినే ఏవోగా నియమిస్తారు. ఇలా జిల్లాలో ఐదు చోట్ల ఖాళీలు ఏర్పడ్డాయి. అధికారులు పదవీ విరమణ చేయడంతో ఖాళీలు తప్పలేదు. అయితే ఇక్కడ కూడా ఇతర జిల్లాల్లో పనిచేసే అధికారులు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ప్రజాప్రతినిధుల ఆశీస్సుల కోసం తంటాలు పడుతున్నారు. ఇదే ఇప్పుడు రెవెన్యూ శాఖలో గుబులు రేపుతోంది. ఇతర జిల్లాల నుంచి ఇక్కడ వచ్చి చేరితే సీనియర్ డిప్యూటీ తహసీల్దార్‌లుగా పనిచేసే కొందరికి అవకాశాలు దక్కవన్న ఆందోళన నెలకొంది. వాస్తవానికి సిబ్బంది కొరత ఉన్నట్టయితే డిప్యూటీ తహసీల్దార్‌లనే ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తారు. తహసీల్దార్ బాధ్యతలు అప్పగిస్తారు. ఎన్నికల ముందు అదే జరిగింది. ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలోనే ఎన్నికలు పూర్తి చేశారు.

ఆచితూచి వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధులు

కూటమి ప్రజాప్రతినిధులు మాత్రం ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గడచిన ఐదేళ్లలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. అవమానాలను భరించారు. గతంలో వైసీపీ ప్రభుత్వానికి అడ్డగోలుగా పనిచేసి ప్రతిపక్షాలను ఇరుకున పెట్టే అధికారులను చెక్ పెడుతున్నారు. పోలీస్ శాఖలో ఇదే జరిగింది. కొందరు సీఐలను వీఆర్‌లో పెట్టారు. అందులో భీమవరం సీఐ ఒకరు. గతంలో యువగళం పాదయాత్ర సందర్భంగా తెలుగుదేశం నాయకులు,శ్రేణులపై కేసులు పెట్టడమే కాకుండా వైసీపీకి కొమ్ముకాశారన్న తెలుగుదేశం నేతల మదిలో గాఢంగా చొచ్చుకుపోయింది. తాజా బదిలీల్లో భీమవరం సీఐని వీఆర్‌లో పెట్టారు. అలాగే పాలకొల్లులో పనిచేసిన పోలీస్ అధికారికి కూడా వీఆర్ తప్పలేదు. ఇప్పుడు ఇతర శాఖల్లో పనిచేసే అధికారులను ముఖ్యంగా రెవెన్యూ శాఖలో పనిచేసే వారిపైనా కూటమి నేతలు దృష్టి పెట్టారు. కూటమికి సానుకూలంగా ఉండడంతో పాటు, సమర్ధతపైనా ఆరా తీసుకుంటున్నారు. అటువంటి వారికి అవకాశం కల్పిస్తున్నారు. జిల్లాకు రప్పించుకుంటున్నారు. రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారులను కూడా ఆ విధంగానే మార్కులు వేస్తున్నారు. ఏరికోరి జిల్లాకు రప్పించుకుంటున్నారు. తాజాగా తహసీల్దార్‌లు సైతం ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు రావడానికి శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. దాంతో ఇక్కడ పనిచేస్తున్న సీనియర్ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు వస్తే అక్కడ ఖాళీలు ఏర్పడతాయి. అక్కడ అవకాశాలు ఉన్నాసరే పూర్వ జిల్లాను పరిగణలోకి తీసుకోవచ్చన్న ఒకే ఒక్క వెసులుబాటును వినియోగించుకుని పశ్చిమకు రావడానికి ఎగబడుతున్నారు. మెట్ట ప్రాం తంలోనూ, ఏజన్సీలోనూ పనిచేసేందుకు ఇష్టపడని అధికారులు ఇప్పుడు డెల్టావైపు అడుగులు వేస్తున్నారు. ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇలా ఇతర జిల్లాల నుంచి అధికారులు ఇస్తే తమకు అవకాశాలు రావన్న ఉద్దేశంతో ఇక్కడ ఉద్యోగుల్లో గుబులు నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి రాకపోతే సీనియర్‌లకు ఇన్‌ఛార్జ్ హోదాలోనైనా అవకాశాలు వస్తాయి. ఇతర ప్రయోజనాలు సమ కూరు తాయన్న భావనలో ఉన్నారు. ప్రభుత్వం నుంచి త్వరతిగతిన ప్రయో జనాలు పొందే అవకాశం ఉంటుందని తలపోస్తున్నారు. ఒక మెట్టు ఎదిగేందుకు అవకాశాలుంటాయి. అదే ఇతర జిల్లాలనుంచి తహసీల్దార్‌లు ఇక్కడకు వస్తే జిల్లాలో పనిచేసే వారికి అవకాశాలు ఉండవంటూ మరో వైపు ఉద్యోగ వర్గాల్లో ఆందోళన నెలకొంది. అయితే కూటమి ప్రజా ప్రతినిధులు మాత్రం సమర్ధత, సానుకూలతకు పెద్ద పీట వేస్తున్నారు. అప్పుడే సై కొడుతున్నారు.

ఒకటినే జీతం !



చాలా కాలమైంది ఇలా తీసుకుని..
ప్రభుత్వ ఉద్యోగుల్లో సంతోషం
డీఏ జమ చేసిన కూటమి ప్రభుత్వం
వైసీపీ ప్రభుత్వ హయాంలో నానా ఇబ్బందులు
అప్పులు దొరక్క..ఈఎంఐలు కట్టలేక.. అగచాట్లు
జీతం వేస్తే చాలు అనుకునే పరిస్థితి

ఆకివీడు రూరల్ ఆగస్టు 4 : జీతం వేస్తే చాలు అనే స్థితి నుంచి 1వ తారీఖునే జీతం పడిందన్న సంతోషంలో ఉద్యోగులున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగానే నెల మొదటి రోజునే ఉద్యోగులు ఖాతాలకు జీతాలను జమ చేస్తుండటంతో ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జీతాలు ఎప్పుడు వేస్తారోనని ఎదురు చూసేవారు. అది కూడా అందరికి ఒకేసారి కాకుండా రోజుల తేడాలో జీతాలు పడేవి. వచ్చే జీతాలను బట్టి తమ కుటుంబ అవసరాలకనుగుణంగా రూపొందించుకున్న ప్రణాళిక గాడి తప్పేది. ఈలోపు ఈఎంఐలు చెల్లించలేక చెక్‌బౌన్స్‌లు అయ్యి సిబిల్ స్కోర్ తగ్గిపోయి నానా ఇబ్బందులు పడ్డారు. పిల్లలకు ఫీజులు చెల్లించాలన్నా, ఇంటి అద్దెలు, హౌసింగ్ లోన్, వాహన రుణాలు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిబిల్ స్కోర్ తగ్గిపోవడంతో బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు అప్పులు ఇవ్వవు. అనారోగ్యంతో బాధపడే కొంతమంది ఉద్యోగులు బాధలు వర్ణనాతీతం. కొన్నిచోట్ల అప్పులు దొరక్క ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా ఉద్యోగులు అత్యవసరాలకు ఉపయోగించుకునే ఎర్న్ లీవ్, జీపీఎఫ్‌లకు దరఖాస్తు చేసుకుని ఎదురుచూపులు చూడడం తప్ప వేరే మార్గమే లేదు. టీఏ, డీఏలు మాట దేవుడెరుగు జీతం సక్రమంగా సరైన సమయానికి ఇస్తే చాలని ఉద్యోగులు ఎదురు చూసేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగస్తులు విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నారు. నూతన ప్రభుత్వం వచ్చాక గత రెండు నెలలుగా 1వ తారీఖునే జీతాలు పడడంతో ఉద్యోగుల్లో సంతోషం వెల్లివిరిసింది.

రుణాలు చెల్లించలేక డిఫాల్టర్లమయ్యాం..



వైసీపీ ప్రభుత్వ హయాంలో జీతాలు సక్రమంగా జమ కాకపోవడంతో బ్యాంకు, వస్తు, వాహన రుణాలు చెల్లించ డంతో డిఫాల్టర్లమయ్యాం. సంబంధిత ఉద్యోగులచే మాటలు పడే పరిస్థితి. జీతాలు పడితే చాలురా భగ వంతుడా అనుకునేవాళ్లం. టీఏ, డీఏ, పీఆర్సీ మాటే మరిచి పోయాం. కూటమి ప్రభుత్వం డీఏ ఇవ్వడం ఆనందకరమైన విషయం.
-ఆర్‌వీ నారాయణ, యూటీఎఫ్ మండల కార్యదర్శి

జీపీఎఫ్, ఎర్న్ లీవుల కోసం ఎదురు చూపులే



వైసీపీ ప్రభుత్వ హయాంలో జీతం కోసం ఎదురు చూడ డమే కాదు. అత్యవసరంలో ఉపయోగించుకునే ఎర్న్ లీవ్‌లు, జీపీఎఫ్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. పిల్లలు చదువు, తల్లిదండ్రుల వైద్యం కోసం అప్పులు చేశాం. పాలవాడు, కిరాణావాడు, ఇంటి అద్దెవాళ్ల నుంచి ఛీత్కారాలు ఎదురు చూశాం. 1వ తారీఖున జీతం రావడంతో ఈ బాధలన్నీ మాయం అయ్యాయి.
- దానయ్య, భీమవరం డివిజన్ వీఆర్‌వోల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు

పుష్కరాలకు కసరత్తు

మూడేళ్ల ముందుగానే పనులకు ప్రతిపాదనలు
ఇప్పటికే అధికారులతో మంత్రుల సమావేశం
మూడు నెలల్లో అవసరమైన పనుల్ని గుర్తించాలంటూ ఆదేశం

నరసాపురం, ఆగస్టు 4: గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం ఇప్పటి నుంచే రెడీ అవుతుంది. 2027లో జరిగే పుష్కరాలను ఈసారి కూడా ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం యోచనలో ఉంది. దానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నది. వారం రోజుల క్రితం రాజమహేంద్రవరం అన్ని శాఖల అధికారులతో మంత్రులు సమావేశమయ్యారు. అవసరమైన పనుల్ని గుర్తించి మూడు నెలల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

2015లో టీడీపీ ప్రభుత్వ హయాంలో...

2015లో జరిగిన గోదావరి పుష్కరాలను టీడీపీ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. దాదాపు రూ.1000 కోట్లు పైనే పుష్కరాలకు వెచ్చించింది. దేశ, విదేశాల నుంచి కూడా యాత్రికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అత్యధికంగా రాజమండ్రిలో భక్తులు స్నానాలు చేయగా తరువాత స్థానం నరసాపురానిదే. పుష్కరాల 12 రోజుల్లో దాదాపు 60 లక్షల మంది యాత్రికులు పుణ్యస్నానాలు ఆచరించారు. వచ్చిన భక్తులకు సేవా కార్య క్రమాలు అందించడంతో దాతలు పోటీపడ్డారు. దీంతో రాష్ట్రా నికి మంచి పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. ఈసారి కూడా ప్రభుత్వం ఇదే రీతిలో పుష్కరాలు నిర్వహించాలని యోచిస్తున్నది. దానికి అనుగుణంగా మూడేళ్ల ముందుగానే పనులు చేపట్టేందుకు రెడీ అవుతోంది. యాత్రికులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన పనుల్ని గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించింది.

గత పుష్కరాల్లో రూ.300 కోట్లతో అభివృద్ధి

గత పుష్కరాల్లో ఒక్క నరసాపురంలోనే రూ.300 కోట్లపైనే అభివృద్ధి జరిగింది. ఇందులో పురపాలక సంఘానికి రూ.100 కోట్లు కేటాయించారు. ఆర్‌అండ్‌బీకి రూ.60 కోట్లు ఇచ్చారు.



నరసాపురం వలందర్ రేవు ఆర్చి

దేవదాయ, ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్, నీటి పారుదలశాఖ, టూరిజం తదితర శాఖలకు మిగిలిన నిధులు కేటాయించారు. ఏటిగట్టుల శాఖ రేవుల్ని అభివృద్ధి చేసింది. పురపాలకం రేవులో ఆర్చితో పాటు గోదావరి బండ్‌పై ఫుట్‌పాత్, రైలింగ్, గ్రీనరీలను ఏర్పాటు చేసింది. ఆర్‌అండ్‌బీ భీమవరం నర సాపురం రోడ్‌తో పాటు యాత్రికులకు ఇబ్బందులు లేకుండా మిగిలిన రహదార్లను అభివృద్ధి చేశారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పంటకాల్వకు ఆనుకుని ఉన్న చినమామిడి పల్లి రోడ్‌ను సగం చెరువు వరకు విస్తరించారు. ట్రాన్స్‌కో మెయిన్ లైన్‌లు, ట్రాన్స్ ఫార్మర్‌లు మార్చి 9 వార్డులో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారు. ఇలా అన్నిశాఖల ఆధ్వర్యంలో పుష్కరాల్లో అభివృద్ధి చేపట్టారు. అయితే అప్పట్లో చివరిలో పనులు చేపట్టడం వల్ల కొంత హడావుడి నెలకొంది. ఈసారి ముందస్తుగా పనులు చేపట్టాలని యోచించడంతో అధికారులు అవసరమైన పనుల్ని గుర్తించే పనుల్లో పడ్డారు. గతంలో చేపట్టిన పనులు, వాటి పరిస్థితి, ప్రస్తుతం చేపట్టాల్సిన పనులు గుర్తిస్తున్నారు.

ఈసారి మరిన్ని ఏర్పాట్లు

గత పుష్కరాలకు దాదాపు రూ.60 లక్షలపైనే భక్తులు విచ్చేశారు. ఆరు రేవుల్లో పుష్కర స్నానాలు చేశారు. రైళ్ల సదుపాయం ఉండటం, రాజమండ్రి కన్నా తక్కువగా ఉంటారని అంచనా. ఇక్కడి స్వచ్ఛంద సంస్థల ఆదరణ, కల్పిస్తున్న సౌకర్యాలు, 216 జాతీయ రహదారి అభివృద్ధి, గోదావరి సముద్రం కలిసే ప్రదేశం కావడంతో ఈసారి కోటిపైనే యాత్రి కులు వస్తారని అంచనా వేస్తున్నారు. దానికి తగట్టు అభివృద్ధి పనులకు గుర్తిస్తున్నారు. రేవుల అభివృద్ధి, వచ్చే యాత్రికులు విడిది, స్నానాల రేవులు, డ్రెస్సింగ్ రూమ్‌లు, ఆలయాల అభివృద్ధి, శిథిలమైన ఏటిగట్ల పటిష్ఠత, విద్యుత్‌శాఖలో కొత్త లైన్లు, అవసరమైన చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, గ్రీనరీ, డ్రైనేజీల అభివృద్ధి, రహదార్ల విస్తరణ, గోదావరి తీరంలో ఉన్న ఆలయాలను సుందరంగా తీర్చి దిద్దడం వంటి పనులను చేపట్టాలని యోచిస్తున్నారు.



రిసార్ట్స్‌లో అసాంఘిక కార్యకలాపాలు 7

ముంపు నుంచి మోక్షం

పంట కాల్వల ప్రక్షాళన
శివారు ప్రాంతాలకు పుష్కలంగా నీరు
ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చొరవ
శివారు గ్రామాల రైతులు, ప్రజల హర్షం



ఆకివీడు రూరల్/ కాళ్ల, ఆగస్టు 4 : డెల్టా ప్రాంతంలో వ్యవసాయానికి పంటకాలువలు, మురుగు కాల్వలే కీలకం. పంట కాలువలపై ఆధారపడి, వ్యవసాయం, ఆక్వా సాగు జరుగుతుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంట, మురుగు కాల్వలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. కాల్వల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగించడంలో నిర్లక్ష్యం వహించడంతో సరియైన సమయానికి సాగునీరు అందక, వరదనీరు దిగువకు వెళ్లక రైతులు అనేక కష్టనష్టాలకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు స్వయంగా ముందుకొచ్చి దాతల సహకారంతో నియోజకవర్గంలోని అన్ని పంట కాల్వను ప్రక్షాళన ప్రారంభించారు. తూడు, గుర్రపుడెక్క తొలగించడంతో శివారు ప్రాంతాలకు పుష్కలంగా నీరు చేరింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీరు నేరుగా సముద్రంలోకి వెళ్లేవిధంగా దోహదపడింది. నియోజకవర్గంలో ప్రధాన పంట కాల్వలు వెంకయ్య వయ్యేరు, ఉండి కాలువలతో పాటు చినకాపవరం డ్రైన్ కూడా ప్రక్షాళన చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నారుమడులు ఎండిపోయేవి, ఇంజన్ల ద్వారా నీటిని తోడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. తాగునీరందించే మంచినీటి చెరువులు అడుగంటాయి. ఏ కాలువ చూసినా తూడు, గుర్రపు డెక్కతో నిండిపోయేవి. కాల్వల ప్రక్షాళనతో మా కష్టాలు తొలగాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల సహకారంతో అన్నయ్యకోడు ప్రక్షాళన

పంట కాలువలు ప్రక్షాళనకు ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు చూపుతున్న చొరవ రైతుల పాలిట వరమని టీడీపీ నాయకుడు మంతెన వెంకట శివరామరాజు, కలవపూడి సర్పంచ్ గేదెల జాన్‌లు అన్నారు. కాళ్ల మండలం కలవపూడి పరిధిలో రైతుల సహకారంతో ప్రక్షాళన చేపట్టిన అన్నయ్యకోడు పంట కాలువను ఆదివారం రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ జువ్వలపాలెం నుంచి ప్రాతాళ్ళమెరక, పల్లిపాలెం, కలవపూడి, మోడీ, వావిలాలపాడు, మామిడిపూడి గ్రామాలకు తాగు, సాగు నీరు అందించే అన్నయ్యకోడు పంట కాలువ గత 15 ఏళ్లుగా ఎటువంటి ప్రక్షాళన జరగకపోవడంతో గుర్రపుడెక్క, నాచు, కిక్కిసలతో నిండిపోయి నీటి ప్రవాహం సాగేది కాదు. ఈ విషయాన్ని ఉండి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. రైతులందరూ తమ వంతు సహకారంగా ఎకరాకు రూ.2000 చొప్పున విరాళాలు సేకరించగా వచ్చిన రూ.13 లక్షల నిధులతో నాలుగు కిలోమీటర్లు పొడవునా సుమారు 40 రోజులు పాటు కాలువను ప్రక్షాళన చేశామన్నారు. ఒకప్పుడు ఆక్రమణలతో పూడుకుపోయిన ఈ పంట కాలువ నేడు మంచినీటితో కళకళాడుతోంది.



పంట కాల్వను చూపిస్తున్న ఆకివీడు కూటమి నాయకులు

ముంపు బారినుంచి బయటపడ్డాం



ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు వెంకయ్య వయ్యేరు, చినకాపవరం కాలువలను ప్రక్షాళన చెయ్యడం వలన వరద ముంపు బారి నుంచి తప్పించుకున్నాం. ప్రతియేటా సుమారు అడుగున్నరకు పైగా వరద నీరు నిలిచిపోయి, ముంపు బారిన పడేవాళ్లం. ఈసారి వరద ముంపు ప్రభావం లేదు.
- కోపల్లెహనుమ, రైతు, ఎంపీటీసీ, గుమ్ములూరు

సమర్థులైన నాయకులతోనే మేలు



ఎమ్మెల్యే చొరవతో కాలువలు ప్రక్షాళన జరిగి సాగు, తాగునీరు పుష్కలంగా వస్తున్నది. ఆయన ముందుచూపు వలన వరద ముంపు నుంచి తప్పించుకుని ఉండి నియోజకవర్గ రైతాంగం ఊపిరి పీల్చుకుంది. ప్రధాన పంట కాల్వల ప్రక్షాళన ద్వారా ఆనందంగా ఉన్నాం.
- యర్రా రవి, రైతు, కోళ్ళపర్రు



ఉపాధి పనుల జాతర

కేంద్రం నిర్ణయంతో ఉపాధి కూలీల్లో ఆనందం

జిల్లాలో భారీగా పెరగనున్న పనిదినాలు..

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 4: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిదినాలు పెంచినట్టు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించడంతో ఉపాధి పనుల జాతర మొదలు కానుంది. ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరం ఉపాధి పనులకు సంబంధించి 2024-25 సంవత్సరానికి 29.5 లక్షల మందికి పనిదినాలు కల్పించారు. ఇంకా ఆర్థిక సంవత్సరం మరో ఏడు నెలల్లో 12.5 లక్షల పనిదినాలు మాత్రమే లక్ష్యంగా ఉండగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనలతో మరిన్ని పనిదినాలు పెరిగేందుకు అవకాశం పెరిగింది. ఈ ఏడాది ఈ ప్రకటనతో ఉపాధి కూలీలకు ఊతం ఇచ్చినట్టయింది.

జిల్లాలో లక్షా 78 మంది ఉపాధి కూలీలు

పశ్చిమగోదావరి జిల్లాలో ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు కలిగిన కూలీలు లక్షా 78 వేల మంది ఉండగా వారిలో లక్షా 35 వేల మంది రెగ్యులర్‌గా ఉపాధి హామీ పనికి వెళ్తూ జీవనోపాధి పొందుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 29 లక్షల 46 వేల పనిదినాల ద్వారా ఉపాధి కూలీలకు రూ.79 కోట్ల 11 లక్షల సొమ్ములు వేతనాలుగా పొందారు. రాబోయే ఏడు నెలల్లో మరిన్ని పనిదినాలు పెంచడంతో ఇదే స్థాయిలో కూలీలకు ఉపాధి లభించనుంది.

పంట బోదెలకు మహర్దశ

ఉపాధి హామీ పథకం ద్వారా మెట్ట ప్రాంతాల్లో ఆయకట్టు చెరువులను తవ్వేందుకు , డెల్టా ప్రాంతాల్లో ప్రధానంగా పంట బోదె తవ్వకాల ద్వారానే ఉపాధి హామీ పనులు సాగుతున్నాయి. దీనికి తోడు బోదెల్లో, పంట కాలువల్లో పేరుకుపోయిన తూడు తొలగింపుపై ప్రధానంగా దృష్టి సారించే అవకాశం ఉంది. దీంతో డెల్టా ప్రాంతాల్లో ఈ ఉపాధి హామీ పనుల ద్వారా పంట బోదెలకు మహర్దశ పట్టనుంది.

మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా..

ఉపాధి హామీ పథకంలో పనిదినాల ద్వారా కూలీలకు వచ్చిన సొమ్ములో 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా జిల్లాకు అభివృద్ధికి నిధులు రానున్నాయి. అంటే రూ.25 కోట్ల వరకూ ఉపాధి పథకం ద్వారా వచ్చే నిధులు రానున్నాయి. గత టీడీపీ హయాంలో ఈ నిధుల ద్వారానే జిల్లాలో భారీగా సీసీ రోడ్లు, భూగర్భ డ్రెయినేజీలు నిర్మించగా ఈసారి ఆ నిధులు గ్రామాల అభివృద్ధికి ఉపయోగించే అవకాశం ఉంది.

మెసేజ్‌లకు స్పందించవద్దు

ఎస్పీ కిశోర్



ఏలూరు క్రైం, ఆగస్టు 4 : మీడియా మాధ్యమాల ద్వారా, ఫోన్‌కాల్స్ ద్వారా, మెసేజ్‌ల ద్వారా వచ్చే వాటికి స్పందించ వద్దని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ప్రజలకు సూచించారు. సైబర్ నేరగాళ్ళు లాటరీ తగిలిందనో, లక్కీడిప్ ద్వారా మీరు ఎంపికయ్యారనో లేదా మీకు కొరియర్ వచ్చిందనో రకరకాల ఫోన్‌కాల్స్ కాని, మెసేజ్‌లు కాని పంపిస్తున్నారని చెప్పారు. ఇలాంటి వాటిని నమ్మి ఆశపడితే చివరకు మోసపోవడమే జరుగుతుందన్నారు. డబ్బులు ఊరికే రావని అదే విధంగా ఊరికే ఎవ్వరు ఇవ్వరని అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఓటీపీ నెంబర్ కాని, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు అడిగితే స్పందించవద్దన్నారు. కొంతమంది వాట్సప్ కాల్స్ చేసి బెదిరిస్తున్నారని తాము సీబీఐ అధికారులమనో, పోలీస్ అధికారులమనో చెప్పి, కొరియర్‌లో డ్రగ్స్ బుక్ చేశారంటూ కేసు నమోదు చేశామని బెదిరిస్తారన్నారు. మరికొంత మంది ఫోన్లను హ్యాక్ చేయడానికి ఏపీకే ఫైల్స్‌ను పంపించి వాటిని ఓపెన్ చేయగానే మన ఫోన్ డేటా సైబర్ నేరగాళ్ళ చేతిలోకి వెళ్ళిపోతోందన్నారు. హ్యాక్ చేసిన తరువాత మన ఫోన్ డేలాలో ఉన్న ఫోటోలను మార్ఫింగ్ చేసి వీడియో కాల్స్ ద్వారా చూపించి బెదిరిస్తారని ఇలాంటి వాటికి భయపడవద్దని వెంటనే జిల్లా పోలీస్ కార్యాలయ వాట్సప్ నెంబర్ 95503 51100కు మెస్సేజ్ రూపంలో తెలియజేయాలని ఎస్పీ కిశోర్ సూచించారు.

రిసార్ట్స్‌లో అసాంఘిక కార్యకలాపాలు



రిసార్ట్స్ వెళ్ళేందుకు సీఆర్‌జడ్ భూముల్లో వేసిన రోడ్డు

- పట్టించుకోని అధికారులు
- పుట్ట గొడుగుల్లా ప్రైవేటు రిసార్ట్స్ నిర్మాణం
- పంచాయతీల నుంచి యథేచ్ఛగా అనుమతులు

మొగల్తూరు, జూలై 30 : జిల్లాలోనే పేరుగాంచిన ఏకైక సాగర తీరం అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతోంది. మొగల్తూరు మండలంలో కేపీ పాలెం, పేరుపాలెం సౌత్ పంచాయతీల పరిధిలో సుమారు తొమ్మిది కిలోమీటర్ల తీరం విస్తరించి ఉంది. సాగర తీరంలో వేళ్లంకిణ్ణి మాత ఆలయం నిర్మాణం తరువాత మొగల్తూరు మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం సాగర తీరాలకు పర్యాటక కేంద్రంగా గుర్తింపు లభించింది. ఇక్కడ అహ్లాదకర వాతావరణం, చల్లటి గాలి, సముద్ర అలల కనువిందు చేస్తుండడంతో ఈ తీరం పర్యాటకులను ఎంతోగానో అకట్టుకుంటుంది. ఏటా కార్తిక మాసంలో వన సమారాధన పేరుతో జిల్లా నుంచే గాక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి లక్షలాది మంది సందర్శకులు, పర్యాటకులు వస్తుంటారు. సెలవు రోజుల్లోనూ తీరం వద్ద పర్యాటకుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. ఇదే అవకాశాన్ని గుర్తించిన పలువురు స్థానికులు పేరుపాలెం సౌత్ పరిధిలో వారికి గల తోటల్లో ప్రయివేట్ రిసార్ట్స్ నిర్మిస్తున్నారు. ఈ రిసార్ట్స్ రూమ్‌లో ఉండే అందాలను సందర్శకులను ఆకర్షించే విధంగా ప్రత్యేక ఫ్లెక్సీల ద్వారా ఏర్పాటు చేయడంతో వాటిలో ఒక్కరోజైన ఎంజాయ్ చేయాలనే ఉద్దేశ్యంతో పర్యాటకులు వస్తున్నారు.

రిసార్ట్స్ రూమ్‌లకు భారీ అద్దెలు

తీరంలో వెలసిన రిసార్ట్స్‌లకు అద్దెలు వాచిపోతున్నాయి. ఒక్కొక్క రూమ్‌కు రూ. రెండు వేల నుంచి రూ.2,500లు వరకూ వసూలు చేస్తున్నారు. అద్దెకు తీసుకునేవారి వివరాలకు సంబంధించిన రికార్డులు నిర్వాహకులు నిబంధలను పాటించడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యాటకులతో పాటు, విద్యార్థులు, యువతీ యువకులు ఈ రిసార్ట్స్‌ను అద్దె తీసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. మందుబాబులు, పేకాట రాయుళ్ళు ఈ రిసార్ట్స్‌లో అహ్లాదంగా గడుపుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

నిబంధనల ప్రకారం రిసార్ట్స్ నిర్మించాలంటే 300 గజాలలోపు నిర్మాణానికి గ్రామ పంచాయతీ, అంతకు పైబడి నిర్మిస్తే టౌన్ ప్లానింగ్ నుంచి అనుమతి పొందాల్సి ఉంది. ఈ రిసార్ట్స్ నిర్మాణం జిరాయితీ భూముల్లో జరిగినప్పటికీ వీటికి వెళ్ళే మార్గం మాత్రం సీఆర్‌జడ్ పరిధి నుంచి కంకరు రోడ్డు రిసార్ట్స్ వరకూ వేసుకున్నారు. రహదారి నిర్మాణానికి గ్రామ పంచాయతీ ఎలా అనుమతి ఇచ్చింది. సీఆర్‌జడ్ భూములు కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు ఏమి చేస్తున్నారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇలా అనధికార కట్టడాలకు సంబంధిత అధికారులు చేతివాటం ప్రదర్శిస్తుండటం వల్లే రిసార్ట్స్ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

సకల శుభాల శ్రావణం

- నేటి నుంచి శ్రావణ మాసం
- వ్రతాలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక సంబరం



ముస్తాబవుతున్న క్షేత్రదేవత కుంకుళ్లమ్మవారి ఆలయ ప్రాంగణం

ద్వారకాతిరుమల, ఆగస్టు 4: శ్రవణా నక్షత్ర ప్రవేశమే....శ్రావణమాసం. హిందువులకు అత్యంత పవిత్రమైన మాసం ఇది. నిత్యం ఆధ్యాత్మిక, ధార్మిక పరిమళాలతో భక్తకోటి పునీతమయ్యే పరమ పవిత్ర మాసం ఈ శ్రావణం. నెలరోజుల పాటు భగవన్నామ స్మరణలతో తెలుగు లోగిళ్ల మార్మోగనున్నాయి. నోములు, వ్రతాలు, పూజలు, ఉపవాసాలతో మహిళలు బిజీగా ఉండే శ్రావణమాసం ఈ రోజు నుంచే ప్రారంభమైంది. ఉత్తరాది వారికి సూర్యమాన క్యాలెండర్ ప్రకారం జూలై 22 నుంచే శ్రావణమాసం ప్రారంభమైంది. అయితే మనం అనుసరించే చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం ఆగస్టు 5 నుంచి శ్రావణం ప్రారంభమవుతుంది. ఆలయాలకు భక్తుల రాకను పురస్కరించుకుని క్షేత్ర దేవతగా కొలువుదీరిన కుంకుళ్లమ్మ ఆలయం ముస్తాబవుతుంది. ఆషాడం వెళ్లిన తర్వాత శ్రావణమాసంలో కొత్తల్లుళ్ల అత్తారిళ్లకు వెళ్లడం ఇక్కడి ఆచారం. శ్రావణమాసంలో 16న వచ్చే రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు.

ఆధ్యాత్మిక సంతృప్తి ఇచ్చేది శ్రావణమే



అన్నివిధాల శ్రేష్టమైనది ఈ శ్రావణ మాసం. వివాహాది శుభకార్యాలు జరుగడంతో పాటు అన్ని రోజులూ దైవపూజకు, వ్రతాలకు అనుకూల మైనవే. అమ్మవార్ల ఆలయాల్లో జరిగే విశేషపూజల్లో పాల్గొంటే శుభం కలుగుతుంది.

- గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ,
వ్రత పురోహితులు, ద్వారకాతిరుమల

నేడు ఆలయ చెరువు లీజుకు వేలం

ముదినేపల్లి, ఆగస్టు 4: ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలోని శ్రీ సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయానికి చెందిన గుడివాడ రూరల్ మండలంలోని మోటూరు గ్రామ పరిధిలోగల 111 ఎకరాల చేపల చెరువును లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 5న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. చెరువులో చేపలు పెంచుకోవటానికి మూడేళ్ల కాలపరిమితికి లీజుకు ఇవ్వనున్నట్లు, వేలాన్ని మోటూరు గ్రామ సచివాలయం వద్ద నిర్వహిస్తామని ఈవో తెలిపారు.

ఉద్యానవన పంటలకు రాయితీ

భీమవరంటౌన్, ఆగస్టు 4 : జాతీయ ఆహార నూనె గింజల పథకం కింద రూ.రెండు కోట్ల 52 లక్షల 20 వేలు మంజూరు అయినట్లు జిల్లా ఉద్యనవన శాఖ అధికారి ఆర్.దేవానంద్ కుమార్ తెలిపారు. ఈ పథకం ద్వారా 300 హెక్టార్లలో ఆయిల్‌పాం పంట విస్తీరణంను లక్ష్యంగా కేటాయించారన్నారు. దీనికి హెక్టార్‌కు దేశీయ రకానికి రూ.20 వేలు, విదేశీ రకానికి రూ.29 వేలు చప్పున రాయితీగా ఇస్తారని తెలిపారు. నాలుగేళ్లకు గాను ఏడాదికి ఎరువులు, అంతర పంటలు వేసినందుకు అదనంగా రూ.10,500 రాయితీ ఇస్తామన్నారు. 202-25 సంవత్సరంలో రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం కింద రూ.15 లక్షల 25 వేలు 40 హెక్టార్లకు కూరగాయల అభివృద్ధి కోసం లక్ష్యంగా కేటాయించారన్నారు. సంకర కూరగాయాలు(హైబ్రీడ్) పండించినందుకు రూ. మూడు వేలు, శాశ్వత కూరగాయ పందిళ్ల వేసుకునేందుకు రూ. రెండు లక్షల 50 వేలు, చొప్పున ఇవ్వనున్నట్లు చెప్పారు. సంకర కూరగాయ(హైబ్రీడ్) విత్తనాలు ఉత్పత్తి చేసిన రైతులకు రూ.20 వేల చొప్పున రాయితీ ఉంటుందని దేవానంద్ కుమార్ తెలిపారు. ఈ ఏడాదికి ఉద్యానవన సమగ్ర అభివృద్ధి పథకం కింద రూ. కోటి 54 లక్షల 78 వేలు పండ్లు, పూవ్వులు, కూరగాయల అభివృద్ధి కోసం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. దీనినిమిత్తం 849.55 హెక్టార్లు లక్ష్యంగా ఉందన్నారు. ఈ పథకం కింద మామిడికి రూ.8 వేలు, జామకు రూ.18 వేలు, కోకోకు రూ.12 వేలు, పూల సాగుకు రూ.16 వేల చప్పున రాయితీ ఇస్తామన్నారు. మామిడి పునర్ధరణకు రూ.18 వేలు, ప్లాస్టిక్ మల్చింగ్‌కు రూ.16 వేలు, ప్యాక్ హౌస్ నిమిత్తం రూ.రెండు లక్షలు, కోల్డ్ స్టోరేజీ నిమిత్తం రూ.ఐదు లక్షల 25 వేలు అందజేస్తామని దేవానంద్ కుమార్ పేర్కొన్నారు. తేనెటీగల పెంపకం నిమిత్తం రూ.10 వేలు, రైతు ఉత్పత్తిదారుల సంఘానికి పంట ఉత్పత్తి, సేకరణ కేంద్రాలకు రూ.ఆరు లక్షలు, పాలీ హౌస్ ద్వారా పూలు, కూరగాయల సాగుకు రూ.46 లక్షలు రాయితీగా అందజేస్తామని తెలిపారు. ఇదే ఏడాది కొబ్బరి అభివృద్ధి బోర్డు విస్తరణ పథకం కింద 200 హెక్టార్లలో రెండు సంవత్సరాలకు రూ.6,500 చొప్పున రిజునేవేషన్,రీ ప్లాంటింగ్‌కు హెక్టార్‌కు రూ.53.500 కేటాయిస్తామని దేవానంద్ కుమార్ వివరించారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడు

కాళ్ళ, ఆగస్టు 4 : అల్లరి చేస్తున్న కొడుకుని మందలించడంతో భయపడి ఇంటి నుంచి వెళ్ళి తప్పిపోయిన బాలుడిని వెతికి సుక్షితంగా అప్పగించినట్లు కాళ్ళ ఎస్ఐ వీరభద్రరావు ఆదివారం తెలిపారు. కాళ్ళ మండలం ఏలూరుపాడుకు చెందిన ఓ బాలుడు తల్లి మందలించిందని శనివారం ఉదయం ఇల్లు వదలి వెళ్ళిపోయాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా ఆదివారం భీమవరంలో అతడి ఆచూకీ లభ్యమైంది. దీంతో పోలీసులు అక్కడి వెళ్ళి బాలుడిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. 24 గంటల లోపే బాలుడి ఆచూకీ కనిపెట్టిన ఎస్ఐ, కానిస్టేబుల్స్ మహేంద్ర దీప్, సురేష్‌ను పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

చంద్రశేఖరరెడ్డి క్షమాపణ చెప్పాలి

ఏలూరు అర్బన్, ఆగస్టు 4 : గత ప్రభుత్వంలో ఉద్యోగుల సంక్షేమ విభాగానికి ప్రభుత్వ సలహాదారుగా పనిచేసిన ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నట్టు ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి జిల్లా శాఖ చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్, కార్యదర్శి ఎన్.రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు రివర్స్ పీఆర్సీ ఫిట్‌మెంట్ చేసినపుడు, సరెండర్ లీవులు, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయినపుడు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇప్పించకుండా ప్రేక్షకపాత్ర పోషించి, నోరుమెదపకుండా ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయిన చంద్రశేఖర్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే అవాకులు, చెవాకులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రశేఖరరెడ్డి తన హయాంలో ఉద్యోగులకు, పెన్షనర్లకు తీవ్రమైన అన్యాయం చేయడమేగాక, జగన్ ప్రభుత్వానికి వంతపాడారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు సకాలంలో జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లను ఇస్తుండగా, జగన్ ప్రభుత్వం 15వ తేదీ వరకు పెండింగ్‌లోనే పెట్టిన విషయాన్ని ఉద్యోగులెవరూ మర్చిపోరన్నారు. తక్షణమే చంద్రశేఖరరెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని ప్రభుత్వానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

డొక్కా సీతమ్మ పేరు హర్షణీయం



సత్యవాడ దుర్గాప్రసాద్

ఏలూరు రూరల్, ఆగస్టు 4: నిత్యాన్నదాత అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరును పాఠశాలలో పిల్లలకు పెట్టే మధ్యాహ్నం భోజన పథకానికి పెట్టడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొంతకాలం క్రితం వరకు డొక్కా సీతమ్మపేరు తెలియని వారు ఉండేవారు కాదన్నారు. అన్నదానం చేసి మానవత్వానికి అర్థం చెప్పిన డొక్కా సీతమ్మ పేరు మధ్యాహ్న భోజన పథకానికి పెట్టడం హర్షనీయమన్నారు. పేదల కడుపునింపే అన్న క్యాంటీన్ మూసేసి కడుపుకొట్టిన వైసీపీకి ప్రజలు సరైన బుద్ధి చెప్పారన్నారు.

కాశీ యాత్రకు వెళ్ళిన భక్తుడి అదృశ్యం



బాదరాల కోటయ్య

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 4 : ఈ నెల ఒకటో తేదీన బస్సులో కాశీ యాత్రకు వెళ్ళిన బాదరాల కోటయ్య(70) మూడో తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పుట్లగట్లగూడెంకి చెందిన కోటయ్య అదే గ్రామానికి చెందిన మరో 40 మందితో కలిసి కాశీ వెళ్లారు. వారణాసిలో బస్సు దిగినప్పటి నుంచి కనిపించక పోవడంతో తోటి ప్రయాణికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. జిల్లా అధికారులు స్పందించి అక్కడి అధికారులతో మాట్లాడి కోటయ్య ఆచూకీ కనుగొనేలా చర్యలు తీసుకోవాలని కోటయ్య కుమారుడు బాబూరావు కోరుతున్నారు.

జ్ఞానేశ్వరికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సక్సెస్

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన దాతలు, ప్రభుత్వం



శస్త్రచికిత్స ముగిసిన తర్వాత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైద్యులు, జ్ఞానేశ్వరి (శస్త్ర చికిత్సకు ముందు)

ఏలూరు అర్బన్, ఆగస్టు 4 : కాలేయ మార్పిడి (లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) శస్త్ర చికిత్సకు అవసరమైన ఆర్థిక స్థోమతలేక దాతల సాయం కోసం అర్థిస్తూ గత వారం రోజులుగా ఎదురుచూస్తున్న ఏలూరుకు చెందిన బాలిక కోటం జ్ఞానేశ్వరికి ఎట్టకేలకు ఆపరేషన్ పూర్తయింది. తమిళనాడు పెరుంబాక్కంలోని గ్లెనిగల్స్ హెల్త్‌సిటీ చెన్నై హాస్పిటల్‌లో చీఫ్ సర్జన్ డాక్టర్ రజనీకాంత్ నేతృత్వంలోని వైద్యుల బృందం జ్ఞానేశ్వరికి శనివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఆదివారం తెల్లవారు జాము 2.30 గంటల వరకు నిర్వహించిన లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసినట్టు బాలిక కుటుంబ సభ్యులు తెలిపారు. బాలికకు వివిధ వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్స, ఆపరేషన్ అనంతరం పర్యవేక్షణ కాలానికి రూ.40 లక్షలు అవసరమవుతాయని వైద్యులు అంచనావేయగా, అంత భారీ మొత్తంలో ఖర్చు భరించే స్థోమత జ్ఞానేశ్వరి తల్లిదండ్రులకు లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ దాతల సాయం కోసం 'ఆదుకోండి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గత నెల 30న ఓ ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనం అదే రోజు నుంచి సోషల్ మీడియాలో వైరల్ అయింది. పలు ప్రాంతాల నుంచి స్పందించిన దాతలు తమ విరాళాలను జ్ఞానేశ్వరి తల్లి దుర్గకు ఫోన్‌పే ద్వారా, బ్యాంకు చెక్కుల రూపంలో పంపించారు. మరోవైపు బాలిక ఆరోగ్యస్థితిని తెలుసుకున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి నేరుగానే జోక్యం చేసుకుని కుటుంబ సభ్యులను వెంటపెట్టుకుని సీఎం కార్యాలయానికి తీసుకెళ్ళి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆపరేషన్‌కు అవసరమైన నిధులను విడుదల చేయాల్సిందిగా కోరారు. దీంతోపాటు మంత్రి లోకేష్ వ్యక్తిగత సహాయకుడు కూడా జ్ఞానేశ్వరి శస్త్ర చికిత్సకు ప్రభుత్వం నుంచి నిధులు అందజేస్తామని, ఆ మేరకు ఎల్‌వోసీని పంపిస్తామని ఆస్పత్రి యాజమాన్యానికి చెప్పారని వివరించారు. ప్రస్తుతం ఇది ఫైనల్ ప్రాసెస్‌లో ఉందని బాలిక కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ లోగా బాలిక ఆరోగ్యస్థితి క్షీణిస్తుండడంతో దాతలు అందించిన విరాళాల మొత్తం రూ.10.50 లక్షలను చెల్లించగా, మిగతా మొత్తానికి జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యుల నుంచి హామీ తీసుకుని శనివారం శస్త్ర చికిత్స చేశారని వివరించారు. తల్లి దుర్గ కాలేయం మ్యాచ్ కావడంతో అందులో 40 శాతం భాగం సేకరించి, కుమార్తె జ్ఞానేశ్వరికి ఆపరేషన్ ద్వారా అమర్చారు. ఇలా తన లివర్‌లో కొంతభాగాన్ని కోల్పోయిన తల్లి దుర్గ కొంతకాలానికే మెడిసన్‌తో పూర్తిస్థాయిలో రీప్లేస్ అవుతుందని వైద్య నిపుణులు చెప్పారని తెలిపారు. కాగా పూర్తిగా లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ జరిగిన జ్ఞానేశ్వరికి అమర్చిన కాలేయం శరీరంలో కలిసి అడ్జస్ట్ చేసుకోవడానికి కనీసం ఆరు నెలలు వైద్యుల పర్యవేక్షణ అవసరమవుతుందని పేర్కొన్నారు. తల్లి దుర్గ ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంతో ఉండగా, కుమార్తె మాత్రం మిగతా అవయవాలు సాధారణ స్థితిలో పని చేసే వరకు కనీసం రెండు రోజులు ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచాలని వైద్యులు చెప్పారని వివరించారు. ఇక ప్రభుత్వం నుంచి ఆపరేషన్ నిర్వహించిన ఆస్పత్రికి ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ఎంత మొత్తానికి ఇస్తారో సోమవారం తేలుతుందని భావిస్తున్నామని, లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ శస్త్ర చికిత్స నిమిత్తమే రూ.25 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, మరికొంత మొత్తం పోస్ట్‌ఆపరేటివ్ కేర్ ఖర్చుల నిమిత్తం అవసరం ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ధన్యవాదాలు

ఆపరేషన్ ఖర్చులు భరించే స్థోమతలేక తీవ్ర ఆందోళనలోవున్న జ్ఞానేశ్వరి దీనస్థితిని బయట ప్రపంచానికి తెలిసేలా ప్రత్యేక కథనంతో దాతలు పెద్దసంఖ్యలో ముందుకువచ్చి ఎవరికితోచిన సాయంవారు అందించేలా కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి, అలాగే తమకు ఆర్థికంగా అండగా నిలిచిన ప్రతిఒక్కరికి బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



అలరించిన నృత్యాలు

ఏలూరు రూరల్, ఆగస్టు 4: నాట్యం అపురూపం, అనిర్వచనీయం, అద్వితీయం, కళాకారుల నాట్య ప్రదర్శన పదాలకు తగ్గట్లు భంగిమలు, భంగిమలకు తగ్గట్లు హావభావాలతో నాట్యకళాకారులు ప్రేక్షకుల మదిని దోచారు. కళాకారులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అభినయ నృత్యభారతి సంస్థ రెండు రోజుల పాటు ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 9వ జాతీయ స్థాయి నర్తనబాల అవార్డుల కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 160 మంది చిన్నారులు నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. నర్తన బాల అవార్డులు స్వీకరించారు. ముగింపు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎంవీ ప్రసాద్ హాజరై మాట్లాడారు. మన వేదాల్లో ఉన్న పురాతన కళలను కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. భారతదేశం భరత నాట్యం, కూచిపూడి తదితర నాట్యాలు సంగీత వాయిద్య కళల సమూహం అన్నారు. భారతీయ జీవన విధానం మన సంస్కృతి పై ఆధారపడి ఉంటుందన్నారు. వేదాల్లోని సంస్కృతిని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారని అన్నారు. ఈ సందర్భంగా కళాకారులు వారి ప్రదర్శనలతో ప్రేక్షకులను రంజింప చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కర్‌రావు, అడుసుమిల్లి నిర్మల, డాక్టర్ డి.సుబ్బారావు, జి.లలితశర్మ, ఎం.కోటేశ్వరరావు, కోటేశ్వరరావు, కేబీ రావు, నాట్యాచార్య దువ్వి హేమసుందర్ పర్యవేక్షించారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఏలూరు సిటీ, ఆగస్టు 4: : ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారితో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ముగ్గురికి ఇన్‌ఫ్లూయెంజా వైరస్ ?

ఆకివీడు రూరల్ ఆగస్టు 4 : కోళ్ళపర్రు గ్రామానికి చెందిన 18 సంవత్సరాలు యువకుడికి, ఆకివీడు పట్టణంలోని జవహర్‌పేట, సాయి నగర్‌లోని వ్యక్తులకు ఇన్‌ఫ్లూయెంజా వైరస్ సోకినట్లు సమాచారం. గత కొద్ది రోజులుగా జలుబు, జ్వరంతో బాధపడుతున్న వీరిని ఆకివీడు సీహెచ్‌సీలో నిర్వహించిన ప్రాథమిక పరీక్షలో పాజిటివ్ అని తేలింది. అయితే ఈ రిపోర్టును వైద్య సిబ్బంది ఉన్నతాధికారులకు పంపారు. ఆ ముగ్గురిని ఐసోలేషన్ నిమిత్తం ఇంటికి పంపినట్లు వారు తెలిపారు.

అన్న క్యాంటీన్



కైకలూరు ఆగష్టు 4: ప్రతి రోజు అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు ఆహారాన్ని అందించిన ఘనత కూటమి ప్రభుత్వా నిదేనని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం కైకలూరులో 47వ రోజు అన్నక్యాంటీన్‌ను టీడీపీ నాయకుడు పొత్తూరి వాసురాజు ఆర్థిక సాయంతో అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ప్రతి రోజు దాతల సహకారంతో నిర్వరామంగా ప్రజలకు భోజనాన్ని అందిస్తున్నామన్నారు. టీడీపీ నేతలు పూల రామచంద్రరావు, ఎంపరహీం, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కౌలు రైతు ఆత్మహత్య



రామకృష్ణ (ఫైల్)

పోలవరం, ఆగస్టు 4 : అప్పుల బాధతో కలుపు మందు తాగి కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోలవరం మండలం గూటాలలో ఆదివారం జరిగింది. పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పలకంశెట్టి రామకృష్ణ (41) అప్పు చేసి 15 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాడు. ఇటీవల వర్షాలు, వరదలకు పంటలు పూర్తిస్థాయిలో నష్టపోవడంతో అప్పులు తీర్చే మార్గంలేక కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు అతనిని వైద్య చికిత్సల నిమిత్తం తాళ్ళపూడిలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు. శనివారం రాత్రి చికిత్స పొందుతూ రామకృష్ణ మృతి చెందడంతో కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

మహిళ మృత దేహం గుర్తింపు



పి.వెంకాయమ్మ (ఫైల్)

జంగారెడ్డిగూడెం, ఆగసు 4 : పంగిడిగూడెం గ్రామ శివారు వద్ద ఎర్రకాలువ గట్టు పక్కన గుర్తు తెలియని మహిళ మృత దేహాన్ని స్థానికులు గుర్తించి జంగారెడ్డిగూడెం పోలీసులకు సమాచారమందించారు. ఎస్సై జ్యోతి బసు ఘటనా స్థలానికి వెళ్ళి వివరాలు సేకరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం గ్రామానికి చెందిన పంపన వీర వెంకాయమ్మ (55) అని ఆమె కుమారుడు వచ్చి గుర్తించినట్లు తెలిపారు. ఆమెకు మతిస్థిమితం లేక ఇంటి నుంచి బయటకు వెళ్ళి మళ్ళీ తిరిగి ఒకటి రెండు రోజుల్లో ఇంటికి చేరుకునేదన్నారు. కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్ళిపోయి కాకినాడలోని ఒక గుడి దగ్గర ఉండడంతో కుటుంబ సభ్యులు వెళ్ళి ఇంటికి తీసుకువచ్చారన్నారు. నాలుగు రోజులు క్రితం బయటకు వెళ్ళిన వెంకాయమ్మ తిరిగి ఇంటికి చేరుకోక పోవడంతో సోమవారం కాకినాడ వెళ్ళడానికి కుటుంబ సభ్యులు సిద్ధపడుతుండగా ఆదివారం ఇలా జరిగిందన్నారు. మతిస్థిమితం లేక పోవడంతో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటుందని ఆయన తెలిపారు. పోస్టు మార్టం నిమిత్తం మృత దేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

పేరుపాలెం బీచ్‌లో యువకుడి గల్లంతు



జాన్‌బాబు(ఫైల్)

మొగల్తూరు/తణుకు ఆగస్టు 4 : స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పేరుపాలెం బీచ్‌కు వచ్చిన ఒక యువకుడు సముద్ర స్నానం చేస్తూ గల్లంతయ్యాడు. తణుకు పాత ఊరుకి చెందిన కొల్లు జాన్‌బాబు (17) అతని స్నేహితులు పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. వీరంతా స్నానంచేస్తుండగా జా న్‌బాబు సముద్ర కెరటాలు ఉధృతంగా రావడంతో గల్లంతయ్యా డు. జాన్‌బాబు తణుకులో ఒక ప్రయివేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. జాన్‌బాబు కోసం స్థానిక పోలీసులు, స్నేహితులు తీరం వెంబడి గాలింపు చర్యలు చేపట్టారు. జాన్‌బాబు తండ్రి బాబురావు చెప్పులు కుట్టు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎనిమిదో తరగతి చదువుతున్న చెల్లెలు ఉంది.

యువకుడికి తీవ్ర గాయాలు

ఆకివీడు, ఆగస్టు 4 : లారీ తప్పించపోయి ఢీకొట్టి పడిపోయిన యువకుడు మీద నుంచి ఆటో వెళ్ళడంతో కుడికాలు నుజ్జునుజ్జుయింది. భీమవరం గునుపూడికి చెందిన సుగుణ స్థానిక మీషో ఆఫీసులో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం భీమవరం ఇంటికి వెళ్ళుతుండగా స్థానిక గుమ్ములూరు సెంటర్‌లో వెళ్ళుతున్న లారీని తప్పించబోయి ఆ లారీనే ఢీకొని కిందపడపోయిన సుగుణ పై నుంచి ఆటో వెళ్ళడంతో కుడికాలు నుజ్జునుజ్జయింది. స్థానికులు పోలీసులు, 108కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించి అంబులెన్స్‌లో ఆసుపత్రికి పంపించి కేసు నమోదు చేశారు. మెరుగైన చికిత్స కోసం రాత్రి విజయవాడ తరలించారు.

యువకులపై కేసు నమోదు

పాలకోడేరు, ఆగస్టు 4: పాతగొడవలు పుస్కరించుకుని ఒక యువకుడిపై దాడి చేసిన యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. విషయానికి వస్తే పాలకోడేరుకి చెందిన దళిత వర్గానికి చెందిన కొంతమంది యువతకులు, బీసీ వర్గానికి చెందిన మరి కొంతమంది యువకులు భీమవరంలోని జగదీష్ మెరైన్ కంపెనీలో పని చేస్తున్నారు. అయితే ఈ రెండు వర్గాల మధ్య 20 రోజులుగా పాత గొడవల నేపథ్యంలో గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం దళిత వర్గానికి చెందిన ఒక యువకుడ్ని బీసీ వర్గానికి చెం దిన కొంతమంది యువకులు తీవ్రంగా గాయపరి చారు. దీంతో దళిత వర్గం యువకులు ఒక్కటిగా చేరడంతో పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు చాకచక్యంగా వ్యవహరించడంతో గొడవ తప్పిందని స్థానికులు అంటున్నారు. గాయపడ్డ యువకుడు కంకిపాటి అభి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యా భర్తలపై దాడి

భీమడోలు, జూలై 4 : గుండుగొలనులో ఆదివారం భార్యాభర్తలపై ఒక వ్యక్తి రాయితో దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. గ్రామానికి చెందిన ముప్పా రాంబాబు తన ఇంట్లో కుక్కలు ఎటో వెళ్ళిపోయాయంటూ తిడుతున్న నేపథ్యంలో ఇదే కాలనీలో ఉంటున్న నత్తాపోతు రాజు తనన్నే తిడుతున్నావంటూ ఘర్షణకు దిగాడు. పోతురాజు, రాంబాబు, అతని భార్య నిర్మలపై రాయితో దాడి చేశారు. భార్యాభర్తలు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉంటే గాయాలైన బాధితులు తమపై దాడి చేసి భార్య మెడలో బంగారు గొలుసు తీసుకుని అసభ్యంగా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

భర్త, అత్త మామలపై ఫిర్యాదు

ఆకివీడు, ఆగస్టు 4 : భర్త, అత్త మామలు మానసకంగా, శారీరకంగా హింసిస్తున్నట్లు భార్య ఫిర్యాదు మేర ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చినకాపవరంనకు చెందిన మద్ది సువర్ణ సావిత్రిని భీమవరం మండలంలోని కొమరాడ గ్రామానికి చెందిన మద్ది దేవిద్రాజుకిచ్చి 2018 వివాహం చేశారు. అప్పటి నుంచి తన భర్త దేవిద్రాజు, అత్త, మామ చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో సువర్ణ సావిత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఇద్దరు పేకాటరాయుళ్ల అరెస్టు

పెదపాడు, ఆగస్టు 4 : పెదపాడు మండలం తాళ్లగూడెంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి ఇద్దరు పేకాటరాయుళ్లతో పాటుగా రూ.2,200లు నగదు స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా పట్టివేత

లింగపాలెం, ఆగస్టు 4: మండలంలోని యడవల్లిలో సారా అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసు కున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలం యడవల్లి గ్రామంలో ఓ వ్యక్తి మోటారు సైకిల్ పై సారా తీసుకువచ్చి గ్రామంలో అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో ఎస్సై చెన్నారావు తన సిబ్బందితో కలిసి దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి ఐదులీటర్ల సారా, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో ఆయనతో పాటు వీఆర్వో సందిపాము వీరయ్య, వీఆర్‌ఏ ఏసు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యానాం మద్యం తరలిస్తున్న ఇద్దరి యువకుల అరెస్టు

పాలకోడేరు, ఆగస్టు 4 : యానాం నుంచి 43 టిన్ బీర్ బాటిల్స్ తరలిస్తున్న భీమవరంనకు చెందిన ఇద్దరు యువకులను పెన్నాడ గ్రామంలో ఆదివారం అదుపులోకి తీసుకుని వారి పై కేసు నమోదు చేసి రిమైండ్‌కు తరలించినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు.

కారును ఢీకొట్టడంతో ఫిర్యాదు

ఆకివీడు, ఆగస్టు 4 : ఐషర్ వ్యాన్ రివర్స్ చేస్తూ తన కారును ఢీకొట్టడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆకివీడుకు చెందిన కేశిరెడ్డి గోపాల కృష్ణ ఉండి మండలం చెరుకువాడ పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్నారు. ఈ నెల 2న గోపాలకృష్ణ తన కారులో భీమవరం వెళ్తుండగా ఆకివీడు ఎంపీడీవో కార్యాలయం దగ్గర జాతీయ రహదారికి వెళ్ళే సరికి ఐషర్ వ్యాన్ రివర్స్ చేస్తూ ఢీకొనడంతో కారు పూర్తిగా దెబ్బతింది. గోపాలకృష్ణ ఫిర్యాదు మేర ఎస్ఐ కేసు నమోదు చేశారు.



పాలకొల్లు, ఉండిలో స్నేహబంధం కంకణాలు కట్టుకున్న స్నేహితులు

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం

పాలకొల్లు టౌన్, ఆగస్టు 4 : స్నేహం అనేది ఒక మధురమైన భావన అని స్నేహితులు లేకుంటే మానవ జీవితానికి పరిపూర్ణత చేకూరదని పాలకొల్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సదర్భంగా ఆదివారం స్థానిక కొత్తకుళాయి చెరువు వద్ద వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. వాకర్స్ మిత్రులు ఒకరికొకరు స్నేహ బంధం కంకణాలు ధరింప చేసుకున్నారు. తదుపరి మిఠాయిలు పంచుకున్నారు. క్లబ్ తరపున జ్ఞాపికలు అందజేశారు. క్లబ్ కార్యదర్శి షేక్ ఫీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు పాల్గొన్నారు.

● ఉండి : ఉండిలోని జంగాలకాలనీ, కోండ్రుతుపేట, కాపులపేట తదితర చోట్ల స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని ఒకరికొకరు చేతులకు బంధం కంకణాలు కట్టుకుని ఆనందంగా గడిపారు. మండలంలోని యండగండి, కోలమూరు, మహదేవపట్నం, ఎన్ఆర్‌పీఅగ్రహారం, చెరుకువాడ తదితర గ్రామాల్లో విద్యార్థులు చిన్నారులు స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు.

'సత్కారో పీపుల్ సేవలు అభినందనీయం'



వైద్య శిబిరంలో తోట సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, ఆగస్టు 4 : సత్కారో పీపుల్ ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీకరి, నిహిత, ఇందిరా చిన్నవయస్సులో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. టీడీపీ జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మిర్తిపాటి గున్నేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కారో పీపుల్ ఫౌండేషన్ వారు చెన్నరంగనిపాలెం పస్తుల సాగరం మున్సిపల్ స్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ అమెరికాలో ఉంటూ మాతృభూమి తెలుగు వారికి సేవ చేయాలనే దృక్పథంతో పనిచేస్తున్న వారికి ధన్యవాదాలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, శెట్టిబలిజ సాధికార సమితి డైరెక్టర్ బొక్కా సూరిబాబు, టీడీపీ నాయకులు చల్లబోయిన గోవింద్, సుబ్బారావు, నేదునూరి గంగాధర్, పాలా శ్రీరామదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను బతికించండి

తణుకు, ఆగస్టు 4: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసిన జీవో 117ను వెంటనే రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి రప్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ ఆదివారం ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం అమలుచేసిన జీవోను రద్దు చేస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. పది మంది పిల్లలున్న స్కూలును మూసివేయకుండా తల్లికి వందనం వంటి పథకాలతో బలోపేతం చేయాలని కోరారు.

సంచార శకటంతో వైద్య సేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ హుస్సేన్

తణుకు, ఆగస్టు 4: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా ఆదివారం ఉచిత వైద్య సేవ లు నిర్వహించాయి. ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నీలు మహేంద్ర తణుకు, అత్తిలి ప్రాంతాల్లో పర్యటించి ఐదుగురికి వైద్య సేవలందించారు. సంఘ సభ్యుడు రవి రెహనాల్డ్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కార్యదర్శి ఎండీ స్వాతిహా, కోశాధికారి అర్ధి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న నిమ్మకాయల యూత్ అధ్యక్షుడు



కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 4: అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ భారీ విజయం సాధించడంతో నిమ్మకాయల యూత్ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ స్థానిక 20వ వార్డులో పుంతల ముసలమ్మ వారికి ఆదివారం 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నాడు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తొలి కొబ్బరికాయను కొట్టారు. అనంతరం పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించారు. మాకా దుర్గబాబు, మేడిశెట్టి శ్రీనివాస్, బండి కృష్ణ, గరగ బాలాజీ, తరుణ్, కర్రి పవన్ పాల్గొన్నారు.

మంటలాంబ అమ్మవార్లకు 'ఆరిమిల్లి' పూజలు

ఇరగవరం, జూలై 4 : రేలంగిలోని పెద్ద మంటలాంబ, చిన్న మంటలాంబ అమ్మవార్లను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో ఘనంగా సన్మానించారు. ఇరగవరం మండల కూటమి శ్రేణులు పాల్గొన్నాయి.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు మంద కృష్ణ మాదిగ మూడు దశాబ్దాల పోరాట ఫలితమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. కొండ్రుప్రోలులో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు అండగా నిలిచిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కంకట చినబాబు, బండి బాపూజీ, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులకు శంకుస్థాపన

నరసాపురం రూరల్,ఆగస్టు 4: వైఎస్‌పాలెం గ్రామంలో ఆదివారం మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో చేపట్టే కల్వర్టు పనులకు సర్పంచ్ వైఎస్ నాగముత్యమాంబ శంకుస్థాపన చేశారు. హరిజనపేట కోలవారిమెరక రహదారి డ్రెయిన్‌కు కల్వర్టులు నిర్మించనున్నారు. కల్వర్టుకు నిధులు కేటాయించిన ఎంపీపీ సోనిని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు వైఎస్ బాబులు, ఉపసర్పంచ్ శ్రీదేవి, వాసు, ఆకన రాజు, రవికుమార్, కార్యదర్శి రఘురాం, ఆకన ఏసులు పాల్గొన్నారు.

పెంటపాడులో కవల దూడల జననం

పెంటపాడు, ఆగస్టు 4: పెంటపాడు గ్రామానికి చెందిన రైతు రెడ్డి దానయ్య గేదె ఆదివారం ఒకే ఈతలో రెండు పెయ్యదూడలకు జన్మనిచ్చింది. కవల దూడలు రెండూ ఆరోగ్యంగా ఉండటంతో వీటిని చూసేందుకు స్థానికులు దానయ్య ఇంటికి తరలి వస్తున్నారు.

కేరళ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

తణుకు/పోడూరు, ఆగస్టు 4: కేరళలో ప్రకృతి వైపరీత్యానికి గురైన బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పీవీ ప్రతాప్ కోరారు. ఆదివారం తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులో దుకాణాల వద్ద విరాళాలు సేకరించారు. మూడు వేల రూపాయల విరాళాలు వచ్చినట్లు వివరించారు. సీపీఎం నాయకులు గార రంగారావు, రమేష్, భాస్కరరావు, అంజి, సాయిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు. పోడూరు మండలం జిన్నూరు గ్రామంలో సీనియర్ నాయకుడు తాళాబత్తుల గాంధీ, పార్టీ కార్యదర్శి కొప్పర్తి నరసింహమూర్తి గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పలు వ్యాపార దుకాణాలు నుంచి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాదు, నాయకులు కలిశెట్టి సింహాచలం, కిలారి సాంబయ్య, జి.గంగాచలం, చివటపు ఆంజనేయులు, డి.గవరమ్మ పాల్గొన్నారు.



ఆర్యపేటలో కంకర గమేళాను మోస్తున్న మంత్రి నిమ్మల.. కావలిపురంలో విత్తనాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- మంత్రి డాక్టర్ నిమ్మల, ఎమ్మెల్యే ఆరిమిల్లి
- రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ

పాలకొల్లు రూరల్/యలమంచిలి/ ఆగస్టు 4 : అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని ఆరు గ్రామాల్లో నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీతో కూడిన వరి విత్తనాలను ఆదివారం ఆయన అందించారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్ చేసిన తప్పులతో వ్యవసాయాన్ని కుంటుపడేలా చేశారన్నారు. డ్రెయిన్ల ప్రక్షాళనకు రూ.90 కోట్ల నిధులు కేటాయించారని, గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు చేపడతామన్నారు. ఆగర్రు, సగంచెరువు, ఆగర్తిపాలెం, వెలివెల, పాలకొల్లు రూరల్, వరిధనం గ్రామాల్లో 231 మంది రైతులకు 500 ఎకరాల్లో రూ.5.67 లక్షల విలువైన 150 క్వింటాళ్ళ వరి వంగడాలు సబ్సిడీపై 80శాతం పోను లక్షా పదమూడు వేల రూ పాయలకే అందజేశామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు, ఏడీఏ ఎ.పార్వతి, ఏవో కె.రాజశేఖర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మామిడిశెట్టి లలితకుమారి, నాయకులు కోడి విజయభాస్కరం పాల్గొన్నారు. యలమంచిలి మండలం యలమంచిలిలంక గ్రామంలో ఆదివారం పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో పశువుల దాణా ఉచిత పంపిణీ కార్యక్రమంలో మంత్రి నిమ్మల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యలమంచిలి మండలం ఆర్యపేట గ్రామం అరుంధతిపేటలో డాక్టర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలపై స్లాబ్ నిర్మాణ పనుల్లో మంత్రి డాక్టర్ నిమ్మల ఆదివారం శ్రమదానం చేశారు. ఇసుక, కంకర గమేళాలను కార్మికులతో కలిసి మిల్లర్‌లో వేశారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. మామిడిశెట్టి పెద్దిరాజు, తాడి శశిధర్, మాతా రత్నంరాజు, పీతల శ్రీనివాస్, బొప్పన హరికిషోర్, పాలపర్తి మాధవరావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

● ఇరగవరం : వైసీపీ పాలనలో కాల్వలు, డ్రెయినేజీల నిర్వహణ గాలికొదిలేయడంతో ప్రస్తుతం పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. కావలిపురంలో పంట నష్టపోయిన రైతులకు సబ్సిడీపై విత్తనాల పంపిణీని ఆదివారం ఆయన చేపట్టారు. రూ. 1250 ఉన్న 30 కేజీల బస్తాను రూ.260కే అందించి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ పుట్టినరోజు వేడుకలు

భీమవరం టౌన్/కాళ్ల/ఆకివీడు/నరసాపురం టౌన్/ఉండి/తాడేపల్లిగూడెం అర్బన్/తణుకు, ఆగస్టు 4 : కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ జన్మదినం పురస్కరించుకుని బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో భీమవరం పార్టీ కార్యాలయంలో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రక్తదానం, చీరలు, పండ్లు, బియ్యం పంపిణీ చేశారు. గునుపూడి ఉమాసోమేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేయించారు. పార్టీ శ్రేణులు కేక్ కట్ చేశారు. అసెంబ్లీ కన్వీనర్ కాగిత సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి రవికుమార్, అల్లూరి సాయిదుర్గరాజు, షేక్ మొహిద్దీన్, వబిలిశెట్టి ప్రసాదరావు, కురెళ్ల నరసింహారావు, కొల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. కాళ్ల మండలం కాళ్లలో బీజేపీ మండల అధ్యక్షుడు సుంకర కాశీ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో మంచినీటి చెరువు చుట్టూ కొబ్బరి, పండ్లు, పూల మొక్కలు నాటారు. ఆకివీడులో బీజేపీ మండలాధ్యక్షుడు కట్రెడ్డి ఏడుకొండలు ఆధ్వర్యంలో అనాథలకు భోజనం పొట్లాలు అందించారు. నరసాపురం పట్టణంలోని రాయపేటలోని పులపర్తి దత్తు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు కేక్ కట్ చేశారు. పలు చోట్ల మొక్కలు నాటారు. ఉండి మండలంలో బీజేపీ కన్వీనరు పేరిచర్ల శ్రీనివాసరాజు, పాత్ర మండల అధ్యక్షుడు యర్రా విక్రమ్ అధ్యక్షతన బాలికల హాస్టల్‌లో కేక్ కట్ చేశారు. తాడేపల్లిగూడెం పట్టణంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి కేక్ కట్ చేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ తదితరులు పాల్గొన్నారు. తణుకు రైల్వేస్టేషన్ సమీపంలో పార్టీ నాయకులు మొక్కలు నాటారు.



భీమవరం పార్టీ కార్యాలయంలో చీరలు, పండ్లు అందిస్తున్న బీజేపీ నాయకులు

ప్రధాని, రాష్ట్రపతి శుభాకాంక్షలు

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



1995-96 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

తణుకు, ఆగస్టు 4: స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వెంకట్రాయపురం తిమ్మరాజు ఉన్నత పాఠశాలలో 1995-96 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు కలుసుకున్నారు. గత స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. మహ్మద్ వలీబాబు, రఘు, బాలాజీ, రాజేంద్ర, విజయ, లీలా తదితరులు పాల్గొన్నారు.

రూ. 22 లక్షల స్కాలర్‌షిప్ పంపిణీ



మాట్లాడుతున్న ఆరిమిల్లి

తణుకు, ఆగస్టు 4: కాకతీయ సంఘం, బండా పట్టాభి చౌదరి ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ జరిగింది. ఇంత మంచి కార్యక్రమానికి నాంది పలికిన బండా రామచంద్ర రావుకు కృతజ్ఞతలు తెలిపారు. 213 మంది విద్యార్థు లకు రూ. 22 లక్షల స్కాలర్ షిప్ అందించడం సంతోకరమన్నారు. కాకతీయ సంఘానికి చెందిన వారికి కాకుండా ఇతర వర్గాల వారికి అందించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేశారు. పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు



యలమంచిలి రైతు సేవా కేంద్రంలో వరి విత్తనాలు


యలమంచిలి/నరసాపురం రూరల్/పాలకోడేరు, ఆగస్టు 4: ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలకు నష్ట పోయిన రైతులకు 80 శాతం రాయితీపై అందించేందుకు ఎంటియూ-1153 (చంద్ర) వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.దేవి తెలిపారు. మండలంలోని ఆయా రైతు సేవా కేంద్రాల్లో 672 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 30 కేజీల విత్తనాల బస్తా ఖరీదు రూ.1134 కాగా 80శాతం రాయితీపై రూ.227 రైతులకు అందిస్తు న్నామని ఏవో తెలిపారు. నష్టపోయిన రైతులు ఆయా గ్రామాల రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలని తెలపారు. నష్టపోయిన రైతులను 80 శాతం రాయితీతో స్వల్పకాలికరకమైన ఎంటీయూ 1153 విత్తనాల్ని సిద్ధంగా ఉంచామని పాలకోడేరు మండల వ్యవసాయాధికారి నారాయణరావు తెలిపారు. పాలకోడేరు మండలంలోని గరగపర్రు, కోరుకొల్లు, మోగల్లు, కుముదవల్లి, పాలకోడేరు, శృంగవృక్షం గ్రామాల్లోని ఆయా కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. ముంపునకు గురైన నారుమడుల స్థానంలో తిరిగి నారుమడులు పోసుకోవాల్సిన రైతులు వెంటనే సంబంధిత రైతు సేవా కేంద్రాల నుంచి 80శాతం సబ్సిడీపై అందించే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు సబ్సిడీపై విత్తనాలు అందజేత

నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల పరిధిలో 1561 క్వింటాల విత్తనాలను రైతులకు సోమవారం అందిస్తామని వ్యవసాయశాఖ ఏడీఈ అనిల్‌కుమారి తెలిపారు. ఎమ్మెల్యే నాయకర్ చేతుల మీదుగా విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

ఆధ్యాత్మికం

శాకంబరి అలంకరణల్లో అమ్మవార్లు



శాకంబరి అలంకరణలో ఆదిలక్ష్మి



శాకంబరి అలంకరణలో గంగాలమ్మ

భీమవరంటౌన్, ఆగస్టు 4 : గునపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ వారికి భక్తులు, దాతల సహకారంతో శాకాంబరీ అలంకరణ నిర్వహించారు. అమావాస్య సందర్భంగా విశేష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం కూరగాయలతో అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, జిల్లా కార్యదర్శి చెనమల చంద్రశేఖర్ దర్శించుకుని పూజలు చేశారు.

● మొగల్తూరు : తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత దేవత ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మకు ఆదివారం శాకంబరి దేవిగా అలంకరించారు. ఆసాఢమాసం ముగింపు సందర్భంగా అమ్మవారిని కూరగాయలతో అలంకరించి పూజలు చేశారు.

● నరసాపురం రూరల్ : ఎల్‌బీచర్ల గ్రామంలో ఆదివారం గంగాలమ్మ అమ్మవారు శాకంబరి అలంకరణ చేశారు. పలు రకాల కూరగాయాలు, పండ్లతో ప్రత్యేక ఆలంకరణ చేశారు. పలువురు భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు

కోట్లమ్మకు ఆషాఢం సారె

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 4: తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామదేవత కోట్లమ్మకు ఆషాఢ సారెను గ్రామస్థుల ఆధ్వర్యంలో సమర్పించారు. గ్రామంలో సారెను మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ పెద్దలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

● పోడూరు : వేడంగి గ్రామదేవత గోగులమ్మ అమ్మవారికి ఆదివారం మహిళలు ఆషాఢం సారె సమర్పించారు. వందలాది మంది మహిళలు సారె సమర్పణలో పాల్గొని 46 రకాల స్వీట్లు, పలు రకాలు పండ్లు, పసుపు, కుంకుమ, గాజులు, వాయిద్య మేళతాళాలతో అమ్మవారికి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ చైర్మన్ బొలిశెట్టి విశ్వేశ్వరరావు, కార్యదర్శి కోట రామారావు, గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆరుగొలను కోట్లమ్మ వారికి సారె తీసుకొస్తున్న గ్రామస్థులు

మారెమ్మ వారికి వలవల బాబ్జి పూజలు

● పెంటపాడు : యానాలపల్లిలో మరిడి మారెమ్మకు గ్రామస్థులు ఊరేగింపుగా తరలివెళ్లి ఆషాఢ సారె అందజేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అమ్మవారికి పూజలు చేశారు. కిలపర్తి వెంకట్రావు, పసల అచ్యుతం, గంధం సతీష్, బండి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మ ఆలయంలో చండీ హోమం

భీమవరంటౌన్ : ఆసాఢ మాసం అమావాస్య సందర్భంగా మావుళ్ళమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన హోమగుండంలో హోమాలను నిర్వహించి పూర్ణాహుతితో కార్యక్రమాన్ని పరిసమాప్తి చేశారు. 92 మంది దంపతులు పాల్గొన్నారు.

● పాలకొల్లు అర్బన్ : స్థానిక కెనాల్‌రోడ్డులోని ఆంజనేయ స్వామివారి ఆలయంలో అమావాస్య, ఆదివారం సందర్భంగా స్వామికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ అరుదుగా వచ్చే ఆదివారం అమావాస్య రోజున ప్రత్యేకంగా పటికతో పూజలుచేయడం జరుగుతుందన్నారు. ఈ పటికను భక్తులకు అందిస్తామని, ఇంటి గుమ్మానికి గానీ, వ్యాపార సంస్థల్లోకాని ఉంచడం వల్ల అని చెడులు తొలగిపోతాయన్నారు.

● ఆచంట : పెదమల్లం మాచేనమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. పలు ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అధికారి రాము సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శిశు మందిరంలో 219వ సూర్యహోమం

పాలకొల్లు అర్బన్, : లోక కల్యాణార్థం, కరోనా వంటి రోగాలు అంతం కావాలని కోరుతూ స్థానిక కోడిగట్టున ఉన్న సరస్వతి శిశు మందిరంలో ఆదివారం 219వ సూర్యహోమం నిర్వహించారు. కరోనా ప్రారంభం నుంచి ప్రతీ ఆదివారం నిర్వహించే విధంగా 219వ సూర్యహోమం నిర్వహించామన్నారు. కేవీఎస్ఎన్ నరసింహరాజు, భాస్కరరావు, కిరణ్ గుప్త, రవి దంపతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి



మావుళ్ళమ్మ చిత్ర పటం వద్ద ఎమ్మెల్యే అంజిబాబు పూజలు

భీమవరం టౌన్, ఆగస్టు 4 : సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. పట్టణంలోని మూడో వార్డు, 32 వార్డుల్లో ఆషాఢమాస అమావాస్య సందర్భంగా మావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ఆయన ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతర ప్రతి ఏటా నిర్వహించడం అభినందనీయమని, ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారి జాతర వేడుకలు చేయడం సంతోషకరమని అన్నారు. శక్తి వేషాలు, గరగల నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు యాతం శ్రీను, మాజీ కౌన్సిలర్ యాతం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలి

స్వాతంత్ర సమరయోధులు ఆదర్శాలను ముందుకు తీసుకువెళ్లి వారి త్యాగాలకు ఫలితాలను ప్రజలకు అందించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాలను ఆయన జ్యోతి ప్ర జ్వలన చేసి ప్రారంభించారు. తొలుత క్విట్ ఇండియా అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు జోహార్లు తెలుపుతూ నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తా



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నాయకర్

మొగల్తూరు, ఆగస్టు 4 : మొగల్తూరు పంచాయతీ పరిధిలోని ఆదర్శ నగర్ కాలనీలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఆదివారం ఆ కాలనీ వాసులు నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. కాలనీ ఏర్పడి సుమారు 15 ఏళ్లు పైబడినా ఎటువంటి మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నట్టు నివాసితులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల అవసరాలు తెలుసుకున్న నాయకర్ వాటిని త్వరిత గతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, కొల్లాటి గోపి, వాటాల కృష్ణమూర్తి, లక్కు బాబి తదితరులున్నారు.

పల్లయ్య కుటుంబానికి పరామర్శ

మొగల్తూరు, ఆగస్టు 4 :ఇటీవల మృతి చెందిన ముత్యాలపల్లి గ్రామ సర్పంచ్ కొపనాతి పల్లయ్య కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు పరామర్శించారు. పల్లయ్య నివాసంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ సీనియర్ నాయకులు నిప్పులేటి బోస్, కడిమి విజయభాస్కర్ అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు.

పశువులను ఇళ్ల వద్దే జాగ్రత్త పరచుకోవాలి

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 4 :పట్టణంలో విచ్చలవిడిగా సంచరించే పశువులు, పందులను వాటి యజమానులు తమ ఇళ్ల వద్దనే కట్టి వేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పార్థసారథి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరి పశువులను వారు జాగ్రత్తగా చూసుకునే విధంగాచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల పట్టణంలో సంచరించే ఆవులు, పందులను పట్టణానికి దూర ప్రాంతానికి తరలిస్తామని హెచ్చరించారు.

శాకాహారంపై అవగాహన ర్యాలీలు

నరసాపురం టౌన్/అత్తిలి, ఆగస్టు 4: నరసాపురం పట్టణంలోని కృష్ణబాబు కాలనీలో ఆదివారం ప్రపంచ శాకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిరమిడ్ మాస్టర్ తాడిమేటి కృష్ణవేణి మాట్లాడుతూ మాంసాహారం వీడి శాకాహారం తింటే సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. అనంతరం జగన్నాథస్వామి, పాతబజార్ సెంటర్లలో మానవహారం నిర్వహించారు. సుభాష్, వీవీ భారతి, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, దుర్గారావు, జగన్నాథరావు, ఆనంతలక్ష్మి, శశికళ, సరోజ, తిరుమాని నాగేశ్వరరావు పాల్గొన్నారు. అత్తిలి మండలం అత్తిలిలో పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ శాకాహారాన్ని భుజించి ఆరోగ్యవంతులు కావాలని అత్తిలి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ నిర్వాహకుడు దాసం వెంకట ప్రసాద్ అన్నారు. ర్యాలీని ఏఎంసీ మాజీ చైర్మన్లు దాసం బాబ్జీ, పోలిశెట్టి చంటి, జనసేన మండల అధ్యక్షుడు దాసం ప్రసాద్, బోడపాటి సూర్యచంద్రరావు ప్రారంభించారు. ర్యాలీలో ధ్యాన మండలి సభ్యులు కడలి మాణిక్యాలరావు, బెతు శ్రీనివాసరావు, ధ్యానులు, శాకాహార ప్రచార కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు మార్టేరులో ఉపాధ్యాయుల సమావేశం

భీమవరంటౌన్, ఆగస్టు 4 : పెనుమంట్ర మండలం మార్టేరులో ఈనెల 6న రెడ్డి కల్యాణ మండపంలో ప్రధానోపాధ్యాయలు, వ్యాయామ ఉపాధ్యాయుల ప్రాంతీయ సమావేశం నిర్వహిస్తున్నట్టు డీఈవో జి.నాగమణి తెలిపారు. ఈ విద్యాసంవత్సరం పాఠ్య ప్రణాళిక, ఏపీవో, ఎస్ఎస్‌సీ, ఇంటర్ ప్రవేశాలపై సమీక్ష ఉంటుందన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, ఏపీ రెసిడెన్సియల్ పాఠశాలల హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యా యులు, ఉపవిద్యాశాఖాధికారులు, ఏపీవో ఎస్ఎస్ స్టడీ సెంటర్ల కో-ఆర్డినేటర్లు హాజరుకావాలన్నారు.

ఆలమూరులో వైద్య పరీక్షలు

పెనుమంట్ర, ఆగస్టు 4 : ఆలమూరులో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ ప్రదీప్‌కుమార్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు విస్తృతంగా కురుస్తున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించామన్నారు. రెండు జనరల్ వైరల్ ఫీవర్స్ నమోదయ్యాయన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ పి.బి. రామారావు, ఎక్సటెన్షన్ ఆఫీసర్ యు.శివ ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ ఎం. నానిబాబు, ఫిమేల్ ఆరోగ్య పర్యవేక్షకురాలు పి.పద్మ కుమారి పాల్గొన్నారు.

పంట నష్టం అంచనా

ఆచంట, జూలై 31 : భారీ వర్షాల కారణంగా పలు మురుగు డ్రెయిన్లు పొర్లి పొంగడంతో అనేక చోట్ల పంట పొలాలు నీట మునిగి నారుమడులు, వరి నాట్లు దెబ్బతిన్నాయి. అధికారులు పంట నష్టం అంచనాలు వేస్తున్నారు. ఆదివారం వేమవరంలో వీఆర్‌వో రత్నమాణిక్యం అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజగోపాల్ గ్రామంలో పంట నష్టం అంచనాలు చేపట్టారు.



సీతారాంపురంలో అనధికార లే-అవుట్

అనధికార లే అవుట్లపై అధికారుల కొరడా

- బోర్డుల ఏర్పాటుకు అధికారులు సిద్ధం

నరసాపురం రూరల్, ఆగస్టు 4:మండలంలో కొందరు వ్యక్తులు ప్రభుత్వానికి ఎటువంటి రుసం చెల్లించకుండా వేసిన అనాధికార లే అవుట్‌లపై కొరడా ఝులిపించేందుకు పంచాయతీ, రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇష్టానుసారంగా వేసిన లే-అవుట్లను గుర్తించే పనిలో పడ్డారు. ప్రభుత్వానికి కన్వెర్సన్ చెల్లించకుండా ఉన్న అక్రమ లేవుట్‌లను గుర్తించి ఆ స్థలాల్లో నోటీస్‌బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. సీతారాంపురంలో నాలుగు ఎకరాలు, 216 జాతీయ రహదారికి అనుకుని ఉన్న 42 సెంట్ల లే-అవుట్‌కు పంచాయతీ ఆధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. కన్వెర్సన్ కట్టించకుండా వేసిన లే-అవుట్‌ల్లో క్రయ విక్రయాలు జరగకుండా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూమి కొనుగోలు చేస్తే ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరగవన్న సమాచారంతో పాటు పంచాయతీల నుంచి విద్యుత్, తాగునీరు, రహదారులు ఉండవంటూ బోర్డులు ఏర్పాటు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. దీనిపై కార్యదర్శి పుల్లాజీని వివరణ కోరగా గ్రామంలో ప్రసాదరాజు వేసిన రెండు లే-అవుట్‌లకు ఎటువంటి అనుమతి లేవు, ఇప్పటికే బోర్డులు ఏర్పాటు చేస్తాం, వాటిని తొలగించారు. దీనిపై చర్యలు తీసుకుంటాం, కన్వర్షన్ సొమ్ము కట్టిన తరువాతే అనుమతులు ఇస్తామన్నారు.